క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఈగల్ ఐజీ



ఆర్‌కే రవికృష్ణకు పూలమొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఈగల్ ఐజీ ఆర్‌కే రవికృష్ణ గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. ఐజీ ఆర్‌కే రవికృష్ణ తన దత్తత గ్రామం కప్పట్రాళ్లలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్నారు. అనంతరం కర్నూలుకు వచ్చి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



మృతిచెందిన రహీంఖాన్

కర్నూలు: కల్లూరు మండలం అబ్బాస్ నగర్‌లో నివాసముంటున్న రహీంఖాన్ (39) అప్పులు తీర్చలేనే బెంగతో ఈ నెల 4న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. రహీంఖాన్ బళ్లారి చౌరస్తా సమీపంలోని అన్వర్ రీబోర్ దుకాణంలో మెకానిక్‌గా పనిచేసేవాడు. ఏడు నెలల క్రితం సెల్ ఫోన్ కొనుగోలుకు అప్పు చేశాడు. కుటుంబ ఖర్చులకు కూడా అప్పులు చేసి తిరిగి చెల్లించలేని పరిస్థితిలో ఈ నెల 4వ తేదీన పురుగు మందు తాగి ఇంట్లో వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు ఆటోలో తీసుకెళ్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక గురువారం మృతి చెందాడు. అతని భార్య పఠాన్ హసీనా ఖాతూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నేడు హెల్త్ వర్సిటీ వీసీ రాక

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఈ నెల 11వ తేదీన కర్నూలు మెడికల్ కళాశాలకు రానున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు కళాశాల కాన్ఫరెన్స్ హాలులో వైద్యులతో, ఆ తర్వాత ఒంటి గంట వరకు పీజీలు, యూజీలతో ఆడిటోరియంలో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఆయన వెంట అకడమిక్ డీఎంఈ సైతం వస్తారని వెల్లడించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఆర్టీసీ బస్టాండులో మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కుటుంబం వచ్చి మృతుడిని గుర్తించారు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలం బుద్దారం గ్రామానికి చెందిన ఆంజనేయ గౌడ్ ఈ నెల 6న తొలి ఏకాదశి పండుగ రోజు మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో భార్య లక్ష్మి గొడవ పడింది. తర్వాత 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి అతడు కనిపించకుండా పోయాడు. తండ్రి అదృశ్యంపై కుమారుడు భానుప్రకాష్ గౌడ్ 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు గోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడు కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో మృతి చెందినట్లు మరుసటి రోజు దిన పత్రికల్లో రావడంతో కుటుంబ సభ్యులు వచ్చి ఆంజనేయ గౌడ్‌గా నిర్ధారించారు. అతని మృతిపై ఎలాంటి అనుమానాలు లేనప్పటికీ విచారణ జరిపి నిజాలు తేల్చాలని కుటుంబసభ్యులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎన్నికల విధులు పక్కాగా నిర్వర్తించాలి

కర్నూలు (టౌన్): బీఎల్‌ఓలు ఎన్నికల విధులను పక్కాగా నిర్వర్తించాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన మహిళలు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం సూచించారు. భరత మాత ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో గుణంపల్లి నారాయణమ్మ ఉచిత కంప్యూటర్, కుట్టు, మెహందీ, బ్యూటీషియన్ శిక్షణ పొందిన వారికి గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, దక్షిణాంధ్ర ప్రాంత కోశాధికారి సందడి మహేష్, జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దాం

- కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే మరింత బలపడతాం
- వచ్చే కార్పొరేషన్ ఎన్నికలే మన మొదటి టార్గెట్
- బాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారెంటీ
- క్యూర్ కోడ్ బ్యానర్ల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎస్వీ వెల్లడి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, ఎస్వీ విజయమనోహరి, గడ్డం రామకృష్ణ, తెర్నేకల్ సురేందర్ రెడ్డి, తదితరులు

కర్నూలు (టౌన్): అధికారం కోసం అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నారని, కేసులకు భయపడకుండా, మరింత బలపడతామన్నారు. గురువారం సాయంత్రం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రతి ఇంటికీ జరిగిన మోసాన్ని వివరించే క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు మోసపోయాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనేందుకు ఇతర పార్టీలను కలుపుకొని, ఇంటింటికీ రెండింతల సంక్షేమ పథకాలు ఇస్తామని మాయమాటలు చెప్పారని, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక చేతులెత్తేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి, రైతులకు ఏడాదికి రూ.20 వేలు సాయం, మహిళలకు నెలకు రూ.1500, యాభై ఏళ్లకు పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు హామీలతో ఇంటింటా ఎంత మోసపోయారో? విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 8 నెలల్లో కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్నాయని, 33 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 2019–24 మధ్య సీఎం జగనన్న సంక్షేమ పాలన అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 5 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని చెప్పారు. మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని ప్రైవేటు పరం చేయించిన చేతకానీ ప్రభుత్వం ఇదని విమర్శించారు. 40 శాతం ఓట్లు సాధించిన జగనన్నకు ప్రభుత్వం ప్రతిపక్ష హోదా ఇవ్వకున్నా.. ప్రజలు నాయకుడిగా గుర్తించారన్నారు. 500 మంది కాదు జగనన్న వస్తున్నాడంటే 50 వేల మంది స్వచ్ఛందంగా తరలి వస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలుసని, అందుకే ఆయనకు అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు.
- కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి మాట్లాడుతూ.. ప్రజలకు జరిగిన మోసాన్ని క్యూర్ కోడ్ ద్వారా ఇంటింటికీ తీసుకెళదామని పిలుపునిచ్చాన్నారు. జిల్లాలో నగర, జిల్లా, రాష్ట్ర క్యాడర్లలో పార్టీ నాయకులతో పటిష్టంగా ఉందని, ఇదే ఉత్సాహంతో వచ్చే మూడేళ్లు పనిచేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, పార్టీ కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామక్రిష్ణ మాట్లాడుతూ.. బాబు ష్యూరిటీ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశాడన్నారు. పార్టీ నాయకులు సిట్రా సత్యనారాయణమ్మ, షరీఫ్, అక్కిమి హనుమంతరెడ్డి, కిషన్, శ్రీనివాసులు, రాఘవేంద్ర నాయుడు, సువర్ణ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కల్లా నాగవేణి రెడ్డి మాట్లాడారు. కార్పొరేటర్లు షేక్ యూనుస్‌బాషా, జుబేర్, షేక్ అహమ్మద్, ఆర్షియా పర్వీన్, అనిల్‌కుమార్, రైల్వే ప్రసాద్,శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. ఆనాడు నవరత్నాల హామీలను వైఎస్ జగనన్న తేదీలు ప్రకటించి అమలుచేస్తే, సూపర్ సిక్స్ హామీలంటూ అబద్ధాలు చెప్పి అన్ని వర్గాలను సీఎం చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. జగనన్నకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఈ ప్రభుత్వం అనేక రకాలుగా కుట్రలు చేస్తోందన్నారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 17న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 మంది ప్రొఫెసర్లు, 37 మంది అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యిందని, అభ్యర్థులకు 17వ తేదీన విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు https://apmsrb.ap.gov.in/msrb/, https://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

ఆర్‌యూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలకు 98 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీటెక్ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం 98 శాతం హాజరు నమోదైంది. 3, 6 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 222 మందికిగాను 218 మంది విద్యార్థులు హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు వెల్లడించారు.

జయప్రదం చేయండి



డీవైఎఫ్‌ఐ జెండాలను ప్రదర్శిస్తున్న మహిళా విభాగం నాయకురాళ్లు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో జూలై 11, 12 తేదీల్లో జరిగే డీవైఎఫ్‌ఐ 19వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి శరీష పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన డీవైఎఫ్‌ఐ మహిళా విభాగ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సమాజంలోని ప్రజలందరికీ కూడు, గూడు, విద్య కోసం పోరాడుతున్న సంస్థ డీవైఎఫ్‌ఐ అన్నారు. అన్ని ప్రాంతాలు, కులాలు, మతాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న డీవైఎఫ్‌ఐ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. యువతీ, యువకులకు విద్యా, ఉపాధి, ఉద్యోగాల కోసం పోరాటాలు చేసిన ఘతన డీవైఎఫ్‌ఐకు ఉందన్నారు. డీవైఎఫ్‌ఐ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ, పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్లను విడుదల చేసిందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నదే డీవైఎఫ్‌ఐ నినాదమని, అందుకోసం కాలేజీలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాధ, ప్రత్యూష, వరలక్ష్మీ, షాహీన్, సుంకన్న, విజయలక్ష్మీ, వేనమ్మ, సోనియా పాల్గొన్నారు.

అదానికి దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజల సొమ్మును అదానికి దోచిపెట్టడానికే విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రాముడు విమర్శించారు. గురువారం సీపీఎం 43వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని రెవెన్యూ కాలనీ, పీవీ నరసింహారావు నగర్, ఇల్లూరు నగర్లలో స్మార్ట్ మీటర్లు వద్దు అని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీన స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ విద్యుత్‌సౌధను ముట్టడించనున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు అధికారంలో లేని సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి.. అధికారంలోకి రాగానే ఒప్పుకోవడం అన్యాయమన్నారు. మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని చెప్పి.. ఇప్పుడు మాత్రం నోరు మెదపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, లాల్ మహ్మద్ పాల్గొన్నారు.

రెండు వృషణాలు ఒకేవైపు!

- పదిలక్షల మందిలో ఒకరికి ఈ సమస్య
- ఐదేళ్ల బాలునికి కర్నూలులో శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా అబ్బాయిల్లో వృషణాలు రెండూ రెండు వైపులా ఉంటాయి. కానీ ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఐదేళ్ల బాలునికి రెండూ ఒకేవైపు ఉన్నాయి. పదిలక్షల మందిలో ఒకరికి వచ్చే ఈ అరుదైన సమస్యకు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌లో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడియాట్రిక్, నియోనేటల్ సర్జన్, పీడియాట్రిక్ యురాలజిస్టు డాక్టర్ వి.సాయిప్రసూన వివరాలను వెల్లడించారు. 'వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతని ఐదేళ్ల కుమారునికి ఇటీవల కుడివైపు వృషణం బాగా వాపు, నొప్పి ఉండటంతో ఆసుపత్రికి అత్యవసరంగా తీసుకొచ్చారు. అవసరమైన పరీక్షలు చేయగా హెర్నియా సమస్య ఉండటంతో పాటు ఎడమవైపు వృషణం కనిపించలేదు. ఆపరేషన్ చేస్తుండగా హెర్నియా శాక్ నుంచి రెండు వృషణాలు బయటకు కనిపించాయి. అత్యంత జాగ్రత్తగా ఒక వృషణాన్ని, దానికి ఉండే రక్తనాళాలు, వాస్ డిఫెరెన్స్ విడిగా చేసి వృషణాలను వేరు చేశాం. ప్రస్తుతం బాబు కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశాం. దీనివల్ల వీర్యం ఉత్పత్తికి, సంతాన సాఫల్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.' అని డాక్టర్ సాయిప్రసూన పేర్కొన్నారు.

- పోకిరీలపై పోలీస్ ఉన్నతాధికారికి మహిళల ఫిర్యాదు
- పోలీసుల అప్రమత్తతో సద్దుమణిగిన సమస్య
- ఐదు మాసాల్లో 17,500 మంది పోకిరీలకు కౌన్సెలింగ్

పోకిరి చేష్టలపై పోలీసు నిఘా



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: కర్నూలులోని ఓ విద్యాలయం వద్ద పోకిరీలు ద్విచక్ర వాహనాలపై కూర్చొని అటుగా వెళ్తున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పోలీస్ ఉన్నతాధికారికి కొంత మంది మహిళలు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. దీంతో పోలీసులు అప్రమత్తమై గురువారం పలు విద్యాసంస్థల వద్ద తనిఖీలు నిర్వహించడంతో పోకిరీలు అక్కడినుంచి పరారైనట్లు సమాచారం. మూడు, నాలుగు పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు విద్యాసంస్థల వద్ద పోలీసులు బృందాలుగా ఏర్పడి విద్యార్థినులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పట్ల అవగాహన కల్పించారు. సబ్ డివిజన్ పరిధిలో మూడు పోలీస్ బృందాలతో యాంటీ ఈవ్ టీజింగ్ బీట్లను తనిఖీ చేయించారు. కర్నూలు కృష్ణానగర్‌లోని రవీంద్ర భారతి జూనియర్ కళాశాల, కేశవరెడ్డి, గుడ్ షప్పర్డ్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో యాంటీ ఈవ్ టీజింగ్ బీట్లను పోలీసు అధికారులు తనిఖీ చేసి విద్యార్థినులకు ధైర్యం చెప్పడమే కాక ఆ ప్రాంతంలో ఎవరైనా ఆకతాయిలు సంచరిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ఈవ్ టీజింగ్, ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అవగాహన కల్పించారు.

ఆరు మాసాల్లో 17,500 మంది పోకిరీలకు కౌన్సెలింగ్

విక్రాంత్ పాటిల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోకిరీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం జిల్లాలో ఉన్న కళాశాలలు, పాఠశాలల వద్ద మఫ్టీ పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పోకిరీలపై నిఘా ఉంచేందుకు డ్రోన్ కెమెరా సేవలను కూడా వినియోగిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు ఐదు మాసాల వ్యవధిలో 17,500 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థినులపై జరిగే అసభ్య ప్రవర్తనను పూర్తిగా నియంత్రించాలనే సంకల్పంతో జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ ప్రత్యేక సేవలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందని ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌వర్మ తెలిపారు. ఉద్యోగుల కోసం స్టేట్ గవర్నమెంటు శాలరీ ప్యాకేజీ (ఎస్‌జీఎస్‌పీ) అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరు ఎస్‌బీఐలో ఖాతా ప్రారంభించి ప్యాకేజీ పొందాలని సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. నికర వేతనాన్ని బట్టి రోడియం, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్ ఖాతాలు ప్రారంభిస్తామని చెప్పారు. రూ.కోటి వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.1.60 కోట్ల విమాన ప్రమాద బీమా, శాశ్వత అంగవైకల్యానికి రూ.కోటి, పాక్షిక అంగవైకల్యానికి రూ.80 లక్షలు, గ్రూపు టర్మ్ బీమా రూ.10 లక్షలు ఉంటుందని వివరించారు. చెక్ బుక్‌తో పాటు నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలన్నీ ఉచితమేనని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎస్‌బీఐ శాఖల మేనేజర్లను సంప్రదించవచ్చని సూచించారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఆస్పరి: మండలంలోని నగరూరు ఎంపీపీ ఎస్‌డబ్ల్యూ పాఠశాల విద్యార్థులకు గురువారం సర్పంచ్ సావిత్రమ్మ, మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీమోహన్ 100 ప్లేట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం నాగరాజు, ఎంపీటీసీ శంకరప్ప ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మొక్కను నాటి నీరు పోస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు సిటీ: విద్య భవిష్యత్తును నిర్ణయిస్తుందని మంత్రి టీ.జి భరత్ అన్నారు. గురువారం టౌన్ మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. స్కూల్ ఆవరణలో పిల్లలచే మొక్కలు నాటించారు. కార్పొరేటర్ మౌనిక రెడ్డి, ఎంఈఓలు సునీత, ఓంకార్ యాదవ్, హెచ్‌ఎం ప్రసాద్, విద్యా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో జరిగిన సమావేశంలోనూ మంత్రి పాల్గొన్నారు. కాలేజీలో గ్రౌండ్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, తదితర సమస్యలను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్‌ఈగా పదోన్నతి



పదోన్నతి పొందిన చిరంజీవులును సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): కర్నూలు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవులుకు ఎస్‌ఈగా పదోన్నతి లభించడం పట్ల ఏపీ మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎంఏఎల్‌జీఓఏ) నేతలు ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాల్గోవా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోన నాగరాజు మాట్లాడుతూ.. చిరంజీవులు మరెన్నో కీలకమైన పదవులను నిర్వహించాలని కోరారు. మాల్గోవా జిల్లా అధ్యక్షుడు వీ.సోమన్న, ఉపాధ్యక్షుడు ఎం.రాగప్ప, కోశాధికారి వై.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పదోన్నతి పొందిన చిరంజీవులును అసోసియేషన్ నేతలు పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

వైద్యురాలి ఇంట్లో చోరీ

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అఫ్రీన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దండుకుని పరారయ్యారు. ఈమె బాలాజీ నగర్‌లో నివాసముంటున్నారు. మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న అరకిలో వెండి, రూ.4 వేలు నగదు తీసుకొని ఉడాయించారు. వైద్యురాలు, కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. తలుపులు తెరచి ఉండటంతో గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.





కర్నూలు షిరిడీ సాయి ఆలయంలో..

జై గురుదేవ



బాలాజీ నగర్ ఆలయంలో..



పూజలు చేస్తున్న భక్తులు



సాయినాథునికి అభిషేకం

కర్నూలు కల్చరల్: జిల్లా వ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వ్యాస మహర్షి (గురు పూర్ణిమ) పురస్కరించుకొని గురువారం సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో ఆది గురువు వేద వ్యాసుని జయంతిని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సామూహిక సాయి వ్రతాలు, శ్రీ సాయి జయ జయ సాయి నామ అఖండ భజన, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, అన్నప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. సాయినాథునికి పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలి రావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.



లలితా పీఠంలో వేద వ్యాసుని చిత్ర పటం వద్ద పీఠం సభ్యులు



శంకర మందిరంలో ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు



సత్యసాయి మందిరంలో సత్యసాయి చిత్రపటంతో పల్లకి సేవలో భక్తులు

అలరించిన 'సాయి లీలలు' నాటకం



నాటకంలో అలరించిన సన్నివేశం

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి సౌజన్యంతో గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శ్రీ షిరిడీ సాయి లీలలు భక్తి నాటకాన్ని ప్రదర్శించారు. సాయిబాబాగా విశ్రాంత ఎస్ఐ, నంది అవార్డు గ్రహీత గుర్రపుసాల అంకయ్య, చాంద్‌పాటీల్‌గా మధుర గాయకులు పి.షేక్షావలి, బాలబటీగా ఎస్‌వీ సుబ్బయ్య, మహల్ సాపతిగా వెంకటేశ్వర్లు నటించారు. హార్మోనిస్టు వెంకటేశ్వర్లు, తబలిస్ట్ గోవర్ధన్ సహకారం అందించారు. నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాయి భక్తులు, నాటకాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

గురువును పూజిస్తే సకల శుభాలు





ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, బెస్త నాయకులు, ధర్మ వ్యాధ మహర్షి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఆరెకటిక నేతలు

కర్నూలు(అర్బన్): గురువును పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని నెల్లూరు జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి జింక శంకర్ అన్నారు. గురువారం సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక టీ.శేషన్న నగర్‌లోని కమిటీ హాల్‌లో వేద వ్యాస మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. బెస్త కులస్థులకు నిర్వహించిన క్రీడలు, 10వ తరగతి, ఇంటర్, నీట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మొమెంటో, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు.

కర్నూలు(అర్బన్): ధర్మ వ్యాధ మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆరెకటిక సంఘం రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు కృష్ణోజీరావు కోరారు. గురుపూర్ణిమ సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లోని ధర్మవ్యాధ మహర్షి విగ్రహానికి ఆరెకటిక నేతలు పాలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు.